క్లుప్తంగా

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే కాటసాని


కమలాపురం దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: కడప జిల్లా కమలాపురం పట్టణంలోని దర్గా ఏ గఫారియా దర్గాలో సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. ఆయన మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక కమలాపురం దర్గా అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అత్తార్‌జాహెద్ హుస్సేన్, ఉపాధ్యక్షులు షేక్ ఇస్మాయిల్‌సాహెబ్, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు షేక్‌బాబులాల్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ


పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పల్లకీ సేవా ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉమామహేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న బ్రహ్మానంద ఆచారి

బనగానపల్లె: మండలంలోని నందివర్గం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి ఉచితంగా పుస్తకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

వైద్యాధికారికి సన్మానం


వైద్యాధికారి ఎల్లప్పను సత్కరిస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల కేంద్రానికి డాక్టర్ ఎల్లప్ప అనంతపురం జిల్లా పామిడిలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. సోమవారం ఆయనను డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ ఎల్లప్పను ఏపీ మ్యార్పీస్ నాయకులు బాలరంగన్న, అచ్చన్న, అంబేడ్కర్ విగ్రహ కమిటీ నాయకులు మద్దిలేటి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగన్న, ఎమ్మార్పీస్ నాయకులు సురేష్, మణిప్రసాద్, ఎర్రిస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ.1,15,640 ఆదాయం

బనగానపల్లె రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఎనిమిది ద్విచక్రవాహనాలకు రూ.1,15640 ఆదాయం వచ్చిందని సెబ్ పోలీసు స్టేషన్ సీఐ జోగేంద్ర తెలిపారు.

నేడు యువత కోసం బుగ్గన 'ముఖాముఖి'

డోన్: స్థానిక కొత్తబస్టాండ్ వెనుక ఓ ఫంక్షన్‌లో మంగళవారం 'యువత కోసం బుగ్గన' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బుగ్గన అభిమాన యువజన సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని నిరుద్యోగం, ప్రభుత్వం చేపట్టిన ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై మంత్రి బుగ్గనతో యువతీ యువకులు ముఖాముఖిగా మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. సదస్సుకు పెద్ద సంఖ్యలో యువతీయువకులు హాజరై జయప్రదం చేయాలని బుగ్గన అభిమాన యువజన సంఘం కోరింది.

దళారుల దందాకు చెక్

- కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల విక్రయానికి శ్రీకారం
- జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- క్వింటాకు రూ.5,440 మద్దతు ధర
- ఆర్‌బీకేల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- పంట నమోదు ఆధారంగా విక్రయాలు
- ఒక్కో రైతు నుంచి గరిష్టంగా వంద క్వింటాళ్ల కొనుగోలు

రైతులకు విత్తు వేసింది మొదలు దిగుబడులు చేతికొచ్చేవరకు కంటి మీద కునుకు ఉండదు. పైరు కాపాడుకోవడం ఒక ఎత్తు అయితే దిగుబడులను విక్రయించుకోవడం మరో ఎత్తు. గత ప్రభుత్వంలో దళారుల బెడదతో తీవ్రంగా నష్టపోయే వారు. జగనన్న ప్రభుత్వం రైతులకు పెద్ద పీట వేసింది. రైతు భరోసా కేంద్రాల్లోనే మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ దళారుల దందాకు చెక్ పెట్టడంతో అన్నదాతల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గాల వారీగా కొనుగోలు కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	కొనుగోలు కేంద్రాల సంఖ్య
బనగానపల్లె	08
నంద్యాల	05
ఆళ్లగడ్డ	09
నందికొట్కూరు	11
శ్రీశైలం	04
డోన్	02
గడివేముల(పాణ్యం)	01

కోవెలకుంట్ల: జిల్లాలోని 29 మండలాల పరిధిలో 1.44 లక్షల ఎకరాల్లో శనగ సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల్లోని రైతులు 1.02 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 14,663 ఎకరాల్లో, సంజామల మండలంలో 10,806, అవుకు మండలంలో 3,503, కొలిమిగుండ్ల మండలంలో 1,906, ఉయ్యాలవాడ మండలంలో 17,799, దొర్నిపాడు మండలంలో 5,552 ఎకరాల్లో శనగ సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 12 వేల నుంచి రూ. 15 వేలు వెచ్చించారు.

క్వింటాకు రూ.5,440 మద్దతు ధర

ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన శనగకు వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడులు కాస్త తగ్గాయి. విత్తనం వేశాక ఒక్కసారి కూడా వరుణుడు కరుణించకపోవడంతో ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే లభించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా దిగుబడుల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. క్వింటాకు రూ.5,440 మద్దతు ధర ప్రకటించి జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. జిల్లాలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, రుద్రవరం, చాగలమర్రి, నంద్యాల, గోస్పాడు, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్, జూపాడుబంగ్లా, గడివేముల, మిడుతూరు, పగిద్యాల మండలాల్లో మార్క్‌ఫెడ్ 40 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో వంద క్వింటాళ్ల దిగుబడులు కొనుగోలుకు అవకాశం కల్పించారు. ఈఏడాది రబీ సీజన్‌లో సాగుచేసి ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకున్న రైతుల దిగుబడులను మాత్రమే కొనుగోలు చేస్తారు. ఇప్పటికే ఆయా ఆర్‌బీకేల్లో రైతులు విక్రయ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. పంట ఉత్పత్తులు కొనుగోలు చేసిన పదిరోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. కొనుగోలు కేంద్రాల్లో దిగుబడులు విక్రయించడం ద్వారా దళారుల దందాకు చెక్ పడటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.


కొనుగోలు కేంద్రంలో శనగ దిగుబడులు విక్రయిస్తున్న దృశ్యం(ఫైల్)

రెండు ఎకరాల్లో శనగ సాగు



నాకున్న రెండు ఎకరాల పొలంలో ఈ ఏడాది రబీలో ఎర్రశనగ సాగు చేశాను. విత్తనాలు, రసాయన ఎరువు లు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టు బడుల రూపంలో ఎకరాకు రూ.10 వేలు వెచ్చించాను. వి త్తనం వేశాక వర్షాలు కురవకపోవడంతో దిగుబడులు తగ్గాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంట ఉత్పత్తుల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. – సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

దళారుల బెడద తప్పింది



ప్రభుత్వం శనగ దిగుబడుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. గతంలో పంట ఉత్పత్తులను దళారుల చేతిలో పెట్టి వారు అడిగిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏటా పంటల దిగుబడులను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు జరుపుతుండటం శుభపరిణామం.
– శ్రీనివాసరెడ్డి, రైతు, గుళ్లదూర్తి, కోవెలకుంట్ల

మిరప త్రిశూలం



కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి గ్రామానికి చెందిన నాగరాజు ఈ ఏడాది ఖరీఫ్‌లో మిరప సాగు చేశాడు. మూడో కోతలో ఒక మిరప చెట్టుకు త్రిశూలం ఆకారంలో మిరపకాయ కాసింది. ఒకే తొడిమకు మూడు మిరపకాయలు కాసి త్రిశూలం ఆకారంలో ఉండటంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. – కోవెలకుంట్ల

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ జయచంద్ర సూచించారు. సోమవారం రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకొప్పెర్ల గ్రామంలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లర్లు, గొడవలకు తావివ్వకుండా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పోలీసుల అనుమతి తీసుకుని రాజకీయ నాయకులు సభలు, రోడ్‌షో, ర్యాలీలు నిర్వహించుకోవాలన్నారు. సీఐ వెంట ఎస్‌ఐ రాంమోహన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

- ఆర్డీఓ మహేశ్వరరెడ్డి


అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

డోన్ టౌన్: ఎన్నికల నిబంధనలు ఎవరూ అతిక్రమించరాదని ఆర్డీఓ మహేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల కార్యకలాపాలు పరిశీలిస్తూ ఉంటామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టరాదని, ప్రజలను ఇబ్బందులకు గురి చేయరాదని సూచించారు. ఎన్నికల ప్రచారం కోసం ముద్రించే కరపత్రాలు, వినియోగించే వాహనాలు ప్రతి ఒక్కటీ అభ్యర్థి ఖర్చులో జమ చేస్తామన్నారు. ముందస్తు అనుమతులు తీసుకోకుండా బహిరంగ సమావేశాలు నిర్వహించరాదని, మైకు ఉపయోగించరాదని, ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన వాటిపై ఏర్పాటు చేయరాదన్నారు. ఇతర రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని ఉల్లఘిస్తే మిగతా పార్టీలు ఆధారాలతో ఫిర్యాదు చేయొచ్చన్నారు. సమావేశంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మధు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

డోన్: మే 13న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందువల్ల నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు.

మండలానికి ఒక చెక్‌పోస్టు

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై నిఘా ఉంచేందుకు మండలానికి ఒక చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. వీటికి తోడు సరిహద్దు రోడ్లపై ఒక్కో చెక్‌పోస్ట్‌ను ఏర్పాటుచేశామన్నారు.

ఓటర్ల వివరాలు

డోన్ నియోజకవర్గంలో 291 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేశామన్నారు. డోన్ గ్రామీణ ప్రాంతాలలో 25,350 పురుష ఓటర్లు, 25,119 మహిళా ఓటర్లతో పాటు ఇతరులు 5 మంది ఉన్నారన్నారు. డోన్ అర్బన్ పరిధిలో 24,065 మంది పురుషులు, 26,833 మంది మహిళా ఓటర్లు, 47 మంది ఇతరులు ఉన్నారన్నారు. బేతంచెర్ల మండలంలో 33,215 పురుష ఓటర్లు, 34,266 మహిళా ఓటర్లు, 15 మంది ఇతరులు, ప్యాపిలి మండలంలో 28,255 పురుష ఓటర్లు, 27,991 మహిళా ఓటర్లు, ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో మొత్తం 2,25,163 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ సంఖ్య ఓటర్ల నమోదుకు అవకాశం ఇంకా ఉన్నందువల్ల మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, బేతంచెర్లలో విద్యార్థులను తనిఖీ చేసి లోపలకు పంపుతున్న పోలీసులు

బనగానపల్లె రూరల్/కోవెలకుంట్ల/కొలిమిగుండ్ల/సంజామల/అవుకు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బనగానపల్లె నియోజవకర్గంలో ప్రశాంతంగా జరిగాయి. బనగానపల్లె మండలంలో 1,614 మంది విద్యార్థులకు గానూ 1,519 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. అలాగే మండలంలో ఓపెన్ టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కోవెలకుంట్ల మండలంలో 322 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 19 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. కొలిమిగుండ్ల మండలంలో 566 మంది విద్యార్థులకు గాను 544 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయ్యారు. సంజామల మండలంలో 408 మంది పరీక్షలు రాయగా 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్ ఆఫీసర్లు తెలిపారు. అవుకు మండలంలో 609 మంది విద్యార్థులకు గానూ 37 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ శ్రీధర్ రావు తెలిపారు.

డోన్ నియోజకవర్గంలో..

డోన్ టౌన్/బేతంచెర్ల/ప్యాపిలి: పదవ తరగతి పరీక్షలకు డోన్ మండలంలో 1,733 మంది విద్యార్థులకు గానూ 1,644 మంది హాజరయ్యారు. 89 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. బేతంచెర్ల మండలంలో 1,178 మంది విద్యార్థులకు గానూ 65 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. ప్యాపిలి మండలంలో 904 మందికి గానూ 85 మంది గైరు హాజరైనట్లు ఎంఈఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం


మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోవెలకుంట్ల: స్థానిక సెబ్(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను సోమవారం ధ్వంసం చేశారు. సెబ్ సూపరింటెండెంట్ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సెబ్ సీఐ వర్ధనాదేవి, సిబ్బంది స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామా ల్లో పట్టుబడిన 12 కేసుల్లోని 20 లీటర్ల మద్యం బాటిళ్లను పగలగొట్టి మద్యాన్ని పారబోశారు.

మద్యం విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: అక్రమ మద్యం కేసులలో 14 మందిని అరెస్టు చేసినట్లు సెబ్ పోలీసులు సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాపిలి, డోన్ మండలాల్లో గతంలోనూ, ప్రస్తుతం మద్యం విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేశామన్నారు.

- బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపిన వివరాలు.. నాటు సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు గ్రామంలో సోదాలు నిర్వహించారు. బిజ్జనగారి మద్దమ్మ, కొత్తపల్లె బాలరాజు నాటుసారా విక్రయిస్తుండగా పట్టుకుని, వారి వద్ద 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ప్రితం రెడ్డి

బేతంచెర్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రితం రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామాన్ని ఎస్‌ఐ శివశంకర్ నాయక్‌తో కలిసి సందర్శించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరూ గొడవలకు వెళ్లకుండా శాంతియుత జీవనం గడపాలన్నారు. అనంతరం రాత్రి బస చేశారు.

బహిరంగా ప్రదేశాల్లో గుంపులుగా ఉండొద్దు

కొలిమిగుండ్ల: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో అనవసరంగా గుంపులుగా ఉండొద్దని సీఐ గోపీనాథ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం సాయంత్రం సీఐ గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆర్టీసీ బస్టాండ్‌లో పదుల సంఖ్యలో తిష్టవేసిన వారిని మందలించారు. రాకపోకలు సాగించే ప్రయాణికులు తప్ప అనవసరంగా ఇక్కడ ఎవరూ తిష్ట వేయరాదన్నారు. ప్రధాన రహదారి వెంట టీకొట్లు, ఇతర దుకాణాల వద్ద బైక్‌లు పార్కింగ్ చేసి జనం పోగై చర్చలు చేస్తుండటంతో పంపించేశారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాటసాని ఓబులరెడ్డి

ఇఫ్తార్ విందు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని జుమ్మా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ఓబుల రెడ్డి ముస్లింలతో కలిసి పాల్గొన్నారు. మసీద్ పేష్‌మామ్ బాబాఫక్రుద్దీన్, మౌజన్ అబ్దుల్‌హఖ్‌లను కాటసాని ఓబుల రెడ్డి సన్మానించారు. అనంతరం మసీదు పెద్దలు కాటసాని ఓబులరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అత్తార్‌జాహెద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం


విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఎం

డోన్ టౌన్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. సోమవారం బస్టాండ్‌లో ప్రయాణికులను ప్రోత్సహించేందుకు ప్రవేశ పెట్టిన లక్కీ డిప్ విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి పట్టణానికి చెందిన శ్రీనివాసులు, రెండవ బహుమతి లద్దగిరికి చెందిన దీవన్న, మూడవ బహుమతి పట్టణానికి చెందిన రమణబాబు దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వెలుగు బస్సులో కర్నూలు రూట్‌లో ప్రయాణించిన వారు దిగిపోయే సమయంలో వారి టిక్కెట్ల వెనుక పేరు, సెల్ నంబరు రాసి డ్రైవర్ సీటు వెనుక ఏర్పాటు చేసిన లక్కీ డిప్ బాక్స్‌లో వేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పథంలో డోన్ పట్టణం


కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

డోన్: మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గం మూడేళ్ల కాలం పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.10 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు వేశామన్నారు. అలాగే రూ.కోట్ల నిధులు వెచ్చించి పట్టణంలో మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, ఆర్ రమణ, రైల్వే నాగేంద్ర, కుళ్లాయి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, యువజన విభాగం అధ్యక్షులు ఆర్‌ఈ రాజవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

బనగానపల్లె రూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బనగానపల్లె పట్టణంతో పాటు మండల కేంద్రం ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలు, పలు ప్రధాన రోడ్లు, కాలనీల్లో ఉన్న వివిధ రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాల తొలగింపుతో పాటు విగ్రహాలకు, శిలాఫలకాలకు ముసుగులు వేశారు. తహసీల్దార్ రవీంద్రారెడ్డి ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అమలులో నిమగ్నమయ్యారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



కొలిమిగుండ్ల: మండల పరిధిలోని యర్రగుడి గ్రామంలోని రైతు పాతపాటి వెంకటరెడ్డికి చెందిన ఎద్దు సోమవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. వ్యవసాయ పనుల కోసం మూడు నెలల క్రితం రూ.1.20 లక్షలకు ఎద్దును కొనుగోలు చేశాడు. ఉదయం పొలం పనులకు ఎద్దులను తీసుకెళ్లాడు. మధ్యలో మేత మేస్తూ ప్రధాన రహదారి సమీపంలోనే పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్న ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

పైర్లకు రక్షణ

బేతంచెర్ల: పైర్లను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల రైతులు తమ పైర్లను పశువుల నుంచి కాపాడుకునేందుకు ముల్లకంచె ఏర్పాటు చేసుకుంటున్నారు. అంబాపురం, గోరుమాను కొండ, సీతారామాపురం గ్రామాల రైతులైతే అడవి జంతువులు, పందుల తాకిడి నుంచి పైర్లను కాపాడుకునేందుకు రంగురంగుల చీరలను కంచెగా ఏర్పాటు చేసుకుంటున్నారు.



ఐదుగురిని కరిచిన వీధి కుక్కలు

బేతంచెర్ల: మండలంలో వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. సోమవారం ఒకే రోజు ఐదుగురిని గాయపరిచాయి. హనుమాన్ నగర్‌కు చెందిన జయలక్ష్మితో పాటు గొరిపేట కాలనీ, రుద్రవరం, బుగ్గానిపల్లె గ్రామాల్లో మరో నలుగురిని వీధి కుక్కలు కరిచాయి. బాధితులు స్థాని శేషారెడ్డి సీహెచ్‌సీలో వైద్యం చేయించుకున్నారు.